నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

I | హైదరాబాద్, గురువారం 30 జనవరి 2025 | YADADRI BHUVANAGIRI


## నేడు గాంధీ విగ్రహాలకు బీఆర్‌ఎస్ వినతులు

### హామీలు అమలు చేయని ప్రభుత్వంపై నిరసన

సూర్యాపేట, జనవరి 29 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఫోర్ ట్వంటీ హామీలను ప్రభుత్వం ఏర్పాటైన 420 రోజులకు కూడా అమలు చేయకపోవడంతో బీఆర్‌ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిరసనలకు సిద్ధమైంది. గురువారం గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రాలు సమర్పించాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గాంధీ విగ్రహాలకు వినతులు సమర్పించనున్నారు. జిల్లా కేంద్రంతోపాటు నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లోనూ వినతిపత్రాలు అందించి కాంగ్రెస్ పార్టీకి మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరాలని బీఆర్‌ఎస్ పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మోసం చేయడమే ఆనవాయితీగా పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల ముందు కూడా ఆరు గ్యారెంటీలు, అలవికాని హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదని విమర్శించారు. ప్రధానంగా రైతు రుణమాఫీ, రైతు భరోసా, పంటలకు బోనస్ ఇవ్వకపోవడం తదితర హామీల అమలు కోసం మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళులర్పించి, అనంతరం వినతిపత్రాలను ఆయన పాదాల వద్ద ఉంచనున్నట్లు తెలిపారు.

## బీఆర్‌ఎస్‌లో జోష్



### నల్లగొండ రైతు మహాధర్నా గ్రాండ్ సక్సెస్

# ఆ నాలుగు పథకాలు ఇప్పట్లో లేనట్టే!

## ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అమల్లోకి ఎన్నికల కోడ్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెప్పుకొంటున్న నాలుగు పథకాల అమలుకు బ్రేక్ పడింది. ముందే అరకొరగా ప్రారంభించిన పథకాలు ఇప్పట్లో అందడం కష్టమే. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో మరో నెలన్నర వరకు పథకాల ముచ్చటే ఉండదు. ఆ తర్వాత వరుసగా స్థానిక సంస్థలు ఎన్నికలు వచ్చే అవకాశం లేకపోలేదు. ఇలా మళ్లీ నెలలపాటు కోడ్ అమల్లోకి ఉండవచ్చు. ఇటీవల ప్రతి మండలంలో ఒక్కగ్రామాన్ని ఎంపిక చేసి ప్రభుత్వ పథకాలను ప్రారంభించిన సంగతి తెలిసిందే. వరుస ఎన్నికల కోడ్ విషయం సర్కారుకు ముందే తెలిసి.. ఇలా ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి చేతులు దులుపుకొంది అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

– యాదాద్రి భువనగిరి, జనవరి 29 (నమస్తే తెలంగాణ)

- మరో నెలన్నరపాటు ఎదురుచూడాల్సిందే..
- ఆ తర్వాత వరుసగా మళ్లీ స్థానిక సంస్థల ఎన్నికలు!
- పక్కా ప్లాన్ ప్రకారమే కాంగ్రెస్ సర్కారు ముందుకు?
- ఇటీవల మండలంలో ఒక్కో గ్రామానికి మాత్రమే పథకాలు
- ఈ సీజన్‌లోనూ రైతు పెట్టుబడి సాయానికి కష్టాలు
- ఇందిరమ్మ ఇండ్ల ముగ్గు పోయనట్టే
- రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసాకూ అంతే..



భూదాన్‌పోచంపల్లి మండలం వంకమామిడిలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న అదనపు కలెక్టర్ గంగాధర్ (ఫైల్)

### మరో నెలన్నర ఆగాల్సిందే..

ఉమ్మడి నల్లగొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పదవీ కాలం మార్చి 29న ముగుస్తుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఎన్నికలు నిర్వహించేందుకు బుధవారం షెడ్యూల్ విడుదల చేసింది. బుధవారం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. వచ్చే నెల మూడో తేదీన నోటిఫికేషన్ విడుదల కానుంది. ఫిబ్రవరి 27న పోలింగ్ జరుగనుంది. తిరిగి మార్చి 8న ఎన్నికల కోడ్ ముగుస్తుంది. అప్పటి వరకు ప్రభుత్వం అధికారికంగా కొత్త పథకాలు, అభివృద్ధి పనులు, శంకుస్థాపనలు చేయడానికి వీలులేదు. దాంతో మరో నెలన్నర పాటు కొత్త పథకాల కోసం ఎదురుచూడాల్సిందే. ఆ తర్వాత కూడా పథకాలు అమలు చేస్తారో, లేదోనని ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. వరుసగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. దాంతో మళ్లీ వరుసగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగియగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఉన్న తక్కువ సమయంలో అమలు చేస్తే తప్ప ఇప్పట్లో పథకాలు అందడం కష్టమనే చెప్పాలి.

### ఇందిరమ్మ ఇండ్లు ఇప్పట్లో లేవ్

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. తొలి విడుతల్లో సొంత స్థలం ఉన్న వారికి ఇండ్ల నిర్మాణానికి రూ.5లక్షల సాయం చేస్తామని సర్కారు ప్రకటించింది. ఒక్కో నియోజకవర్గానికి 3,500 మంది అర్హులకు ఇస్తామని పేర్కొంది. జిల్లాలో ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇండ్ల కోసం 2,01,977 దరఖాస్తులు వచ్చాయి. వారిలో అర్హులను గుర్తించేందుకు ప్రభుత్వం సర్వే నిర్వహించింది. 1.96లక్షల మంది అప్లికేషన్లను పరిశీలించగా, 56,964 మందికి సొంత ఇండ్లు లేవని, 22,397 మందికి సొంత ఇండ్లతోపాటు స్థలాలు కూడా లేవని తేల్చారు. మొత్తంగా 79,361 మందిని అర్హులుగా గుర్తించారు. ప్రభుత్వం ఇటీవల గ్రామ సభలు కూడా నిర్వహించింది. అందులో అర్హుల జాబితాను ప్రకటించింది. కానీ ఈ నెల 26న పథకాలు అందిస్తామని ప్రగల్భాలు పలికినా.. యాదాద్రి భువనగిరి జిల్లాలో 17 గ్రామాలకు మాత్రమే పరిమితం చేసింది. అసలు ఎవరికి ఇస్తరో.. ఎప్పుడు ఇస్తారో.. స్పష్టత లేదు. అంతేగాక ఇటీవల ఇండ్ల మంజూరు ప్రొసిడింగ్ కాపీలు పొందినోళ్లు కూడా ఇండ్ల నిర్మాణానికి ముగ్గు పోయడానికి బ్రేక్ పడినట్లయ్యిందని అధికారులు చెబుతున్నారు.

### ఈ సీజన్‌లోనూ రైతులకు కష్టకాలమే!

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పంట సీజన్ ప్రారంభంలో రైతుబంధు డబ్బులు వెంట వెంటనే బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేవి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీన్ రివర్స్ అయ్యింది. గతేడాది యాసంగి సీజన్‌లో ఆలస్యంగా పాత పద్ధతిలోనే ఎకరాకు రూ.5వేల చొప్పున రైతు భరోసా పేరుతో డబ్బులు జమ చేశారు. ఇక రబీ సీజన్‌లో మొత్తానికే ఇవ్వకుండా మొండి చెయ్యి చూపించారు. ఇప్పుడు యాసంగి సీజన్‌లో అనర్హుల ఏరివేత, కమిటీల పేరుతో కాలయాపన చేశారు. ఇప్పటికే రైతులు పెట్టుబడి సాయానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనేక మంది మిత్తికి అప్పులు తెచ్చి సాగు పనులు చేస్తున్నారు. ఇప్పుడు మళ్లీ మరో నెలన్నరపాటు పంట పెట్టుబడి సాయం ఆలస్యం కానుండడంతో ఈ సీజన్‌లోనూ రైతులకు కష్టకాలం వచ్చినట్లయ్యింది. ఒక్క యాదాద్రి భువనగిరి జిల్లాలోనే సుమారు రెండు లక్షల మంది రైతులు రైతుభరోసా కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

### రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసాకూ అడ్డంకి..

రైతుభరోసాతోపాటు వ్యవసాయ కూలీలకు కూడా ఆర్థిక సాయం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పింది. ఏటా కనీసం 20 పని దినాలు చేసిన వారికి సంవత్సరానికి రూ.12వేలు ఇస్తామని ప్రకటించింది. పథకానికి కుటుంబ యూనిట్‌గా తీసుకున్న నేపథ్యంలో 16,927 మందిని ప్రతిపాదించారు. కానీ అర్హుల జాబితా ఎంపిక ప్రక్రియతోనే ఆగిపోయింది. కొత్త రేషన్ కార్డులదీ అదే పరిస్థితి. జిల్లాలో 70,894 మందిని అర్హులుగా గుర్తించారు. ఇక కార్డుల్లో సభ్యులుగా చేరిక కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న 43,360 మందిని పరిగణలోకి తీసుకున్నారు.


### ప్లాన్ ప్రకారమేనా?

వాస్తవానికి ప్రభుత్వం జనవరి 26న అర్హులందరికీ పథకాలు వర్తింపజేస్తామని ప్రకటించింది. దరఖాస్తులు, గ్రామ సభల పేరుతో హడావుడి చేసింది. తీరా మండలానికి ఒక్క రెవెన్యూ గ్రామాన్ని మాత్రమే ఎంపిక చేసింది. గణతంత్ర దినోత్సవం రోజున వారికి మాత్రమే పథకాలను వర్తింపజేసింది. దాంతో ఏడాది కాలంగా ఎదురుచూస్తున్న మిగతా లబ్ధిదారులకు నిరాశే ఎదురైంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల కోడ్ వస్తుందని ముందే భావించి.. ఎంపిక చేసిన గ్రామాల్లోనే పథకాలను ప్రారంభించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు కోడ్ రావడంతో మరో నెలన్నర పాటు పథకాలు అమలు చేయాల్సిన అవసరం ఉండదనే భావించి ఇలా చేసిందనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఆ తర్వాత స్థానిక సంస్థలు వస్తే మళ్లీ కోడ్ వచ్చే అవకాశం ఉంది. ఇలా సాధ్యమైన మేరకు కాలయాపన చేయడమే పనిగా పెట్టుకున్నట్లు కనిపిస్తున్నది.



మంగళవారం నల్లగొండ రైతు మహాధర్నాకు వస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు స్వాగతం పలికిన రైతులు, అభిమానులు (ఫైల్)

- స్వచ్ఛందంగా పెద్దఎత్తున తరలివచ్చిన రైతులు
- ప్రభుత్వంపై కట్టలు తెంచుకున్న వ్యతిరేకత
- బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నూతనోత్తేజం
- ఫలించిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి వ్యూహం





గులాబీ జెండా ఊపుతూ కార్యకర్తలకు అభివాదం చేస్తున్న మాజీ మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి (ఫైల్)

నల్లగొండ, జనవరి 29 : పోరాటాల పురిటి గడ్డ నల్లగొండ తాజాగా బీఆర్‌ఎస్ పార్టీ రైతుల పక్షాన నిర్వహించిన మహాధర్నాతో గులాబీమయం అయ్యింది. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలను ఖండిస్తూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమర శంఖం పూరించగా రైతులోకం కదిలివచ్చింది. ఈ సందర్భంగా మంగళవారం నాటి మహాధర్నా సమయంలో క్లాక్ టవర్ సెంటర్ ఇసుకేస్తే రాలనంతగా కిక్కిరిసింది. రైతు సమస్యలపై ముందుండి పోరాడడానికి వచ్చిన కేటీఆర్‌కు నల్లగొండ ఘన స్వాగతం పలికింది. ఊహించని స్థాయిలో రైతులు స్వచ్ఛందంగా తరలి రాగా, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో చేపట్టిన రైతు మహా ధర్నా గ్రాండ్ సక్సెస్ అయింది. ఇది బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపింది.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12కి 12 అసెంబ్లీ స్థానాల్లో విజయకేతనం ఎగురవేసిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీది. కాంగ్రెస్ 2023 ఎన్నికల్లో అలివికాని హామీలతో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను గెలుచుకోగా, బీఆర్‌ఎస్ శ్రేణులు కొంత నైరాశ్యంలో పడ్డాయి. ఏడాది తర్వాత నల్లగొండ కేంద్రంగా నిర్వహించిన రైతు మహాధర్నా విజయవంతం కావడంతో గులాబీ శ్రేణుల్లో నూతన జోష్ నింపినట్లు అయ్యింది. కేటీఆర్ ప్రసంగంలో కాంగ్రెస్ పాలనలో విమర్శించిన ప్రతి సందర్భంలోనూ రైతులు ఈలలు, చప్పట్లతో మద్దతు తెలపడం ప్రభుత్వంపై రైతాంగంలో ఎంత వచ్చిందో స్పష్టం చేసింది. ఈ సందర్భంలో బీఆర్‌ఎస్ లీడర్లు ఉత్సాహంగా ఇచ్చి ప్రసంగం రైతుల్లో కొత్త ఆశలను నింపింది.


**అబద్ధపు హామీలపై మొదలైన తిరుగుబాటు..**

కాంగ్రెస్ నేతలు ఇచ్చిన 420 అబద్ధపు హామీలు, ఆరు గ్యారెంటీలతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 11 స్థానాలను గెలుచుకున్న కాంగ్రెస్‌పై ఏడాది కాలంలోనే తిరుగుబాటు మొదలైంది. ఎన్నికల సమయంలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ, రైతుభరోసా కింద ఎకరాకు రూ.15వేలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ సర్కార్ ఏడాదైనా అమలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేసీఆర్ పాలనలో క్రమం తప్పకుండా అందిన రైతుబంధు, రుణమాఫీని గుర్తు చేసుకుంటున్నారు. కేసీఆర్ పాలనే బాగుందని చెప్పుకొంటున్నారు. ఈ క్రమంలో మంగళవారంలో నల్లగొండలో నిర్వహించిన రైతు ధర్నాకు మంచి స్పందన లభించింది. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు రైతులు పెద్దసంఖ్యలో తరలి రావడంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేల పిలుపు కూడా తోడవడంతో రైతాంగం పెద్ద ఎత్తున కదిలింది. ఈ క్రమంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి వ్యూహం పూర్తిగా సఫలమైంది.

## టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు మోగిన నగారా

- మార్చి 3న కౌంటింగ్.. ఫలితాల వెల్లడి
- వరంగల్-ఖమ్మం-నల్లగొండ నియోజకవర్గంలో 24,905 మంది ఓటర్లు
- రెండు నెలల నుంచే అభ్యర్థుల ప్రచారం

### ఫిబ్రవరి 3న నోటిఫికేషన్.. 10 వరకు నామినేషన్లు.. 27న ఎన్నిక



రామగిరి, జనవరి 29 : నల్లగొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు బుధవారం షెడ్యూల్ విడుదలైంది. ప్రస్తుత ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అల్లుబెల్లి నర్సిరెడ్డి పదవీ కాలం మార్చి 29తో ముగుస్తుండడంతో ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధమవుతున్నది. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ విడుదల కానుండగా, 10వరకు నామినేషన్ల ప్రక్రియ సాగుతుంది. 27న ఎన్నికలు నిర్వహించి మార్చి 3న కౌటింగ్‌తోపాటు అదేరోజు ఫలితాలు వెల్లడించనున్నారు. కాగా, ఇప్పటికే ఆయా ఉపాధ్యాయ సంఘాల నేతలు ప్రచారం షురూ చేశారు. ఇక ప్రచారం మరింత ఊపందుకోనున్నది. ఈ ఎన్నికల బరిలో టీఎస్‌యూటీఎఫ్, పీఆర్‌టీటీఎస్, టీచర్స్ జాక్, తపస్, పీఆర్‌టీయూ తెలంగాణ బలపర్చిన అభ్యర్థులతోపాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా పోటీలో ఉండే అవకాశం ఉంది.

ఉమ్మడి నల్లగొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించే ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉపాధ్యాయ ఓటర్ల నమోదుకు దరఖాస్తులు స్వీకరించి తుది జాబితాను గత నెలలోనే విడుదల చేసింది. మొత్తం 24,905 మందిగా ఓటర్లు నమోదయ్యారు. వీరంతా ఓటు హక్కు వినియోగించుకునేందుకు 200 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. నల్లగొండ జిల్లాలో 4,483, సూర్యాపేటలో 2,637, యాద్రాద్రి భువనగిరి 921, సిద్దిపేట 163, జనగాం 921, హన్మకొండ 5, 098, వరంగల్ 2, 225, మహబూబాబాద్ 1,618, భూపాలపల్లి 323, ములుగు 612, భద్రాద్రి 1, 949, ఖమ్మంలో 3, 955 మంది ఓటర్లు ఉన్నారు. 2019 మార్చి 22న జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి నియోజకవర్గంలో 20,888మంది ఓటర్లు ఉండగా, ఈసారి 4, 017మంది అదనంగా ఓటు నమోదు చేసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులోకి వచ్చింది. మార్చి 8న ముగిస్తుందని ఎన్నికల సంఘం ప్రకటించింది.

**బరిలో అభ్యర్థులు...**

ప్రస్తుతం నల్లగొండ-వరంగల్-ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీగా ఉన్న అల్లుబెల్లి నర్సిరెడ్డిని టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థిగా ఆ సంఘం రాష్ట్ర నాయకత్వం ఇప్పటికే ప్రకటించింది. ఆయన ప్రచారం కూడా చేస్తున్నారు. టీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థిగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి, తపస్ అభ్యర్థిగా పులి సరోత్తమ్‌రెడ్డి, టీచర్స్ జాక్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్సీ పూల రవీంద్, పీఆర్‌టీయూ తెలంగాణ అభ్యర్థిగా గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా పన్నాల గోపాల్‌రెడ్డి తాము బరిలో ఉండనున్నట్లు ప్రకటించారు. వీరంతా ప్రచారాన్ని సాగిస్తూనే ఉపాధ్యాయుల వద్దకు వెళ్లి తమకు తొలి ప్రాధాన్యతా ఓటును వేయాలని అభ్యర్థిస్తున్నారు. టీఎస్‌యూటీఎఫ్, టీచర్స్ జాక్ అభ్యర్థులతోపాటు స్వతంత్ర అభ్యర్థి కూడా నల్లగొండ జిల్లావాసులే.

**ఎన్నికల షెడ్యూల్...**

- ఫిబ్రవరి 3.. నోటిఫికేషన్
- ఫిబ్రవరి 10.. నామినేషన్స్ చివరి గడువు
- ఫిబ్రవరి 11.. స్క్రూటినీ
- ఫిబ్రవరి 13.. నామినేషన్ల ఉపసంహరణ
- ఫిబ్రవరి 27.. పోలింగ్ (ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు)
- మార్చి 3.. కౌంటింగ్
- మార్చి 8లోగా ఎన్నికల ప్రక్రియ పూర్తి



మోత్కూరు జడ్పీహెచ్‌ఎస్‌లోని క్రీడా మైదానం చదును చేస్తున్న డోజర్లు

## రాష్ట్ర స్థాయి క్రీడలకు ఏర్పాట్లు

మోత్కూరు, జనవరి 29 : పట్టణ కేంద్రంలో ఫిబ్రవరి 8, 9, 10 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని క్రీడా మైదానాన్ని సిద్ధం చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం గ్రౌండ్‌లో ఎర్ర మట్టి పోసి చదును చేశారు. రాష్ట్ర వాలీబాల్ కోచ్ కృష్ణారెడ్డి, ఎంఈఓ టి.గోపాల్‌రెడ్డి, విశ్రాంత పీడీ సోమనర్సింహారెడ్డి, ఎండీ నయీమ్ ఆహ్మద్, ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి పనులను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో రెండు కబడ్డీ, వాలీబాల్ కోర్టులు ఏర్పాటు చేసే విధంగా సూచనలు చేశారు. సాంస్కృతిక పోటీల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, ప్రముఖ రచయిత అభినయ శ్రీనివాస్, ఎస్ఎన్‌చారి, అరవిందరాయుడు, అవిలిమల్లు, బయ్యని పిచ్చయ్య, ఉయ్యాల అంజయ్య, రవి, ఉప్పలయ్య, జయశ్రీ, రామచంద్రు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట ఏఈఓ హరికిషన్ పదోన్నతి రద్దు

యాదగిరిగుట్ట, జనవరి 29 : వేములవాడ రాజరాజేశ్వరి ఆలయంలో ఏఈఓగా విధులు నిర్వహించి గతేడాది ఆగస్టులో యాదగిరిగుట్టకు బదిలీపై వచ్చిన హరికిషన్‌కు పదోన్నతిని రద్దు చేస్తూ ఆలయ ఈఓ భాస్కర్‌రావు ఈ నెల 18న ఉత్తర్వులు జారీ చేయగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇక నుంచి గుట్ట దేవస్థానంలో ఆయన సూపరింటెండెంట్‌గా కొనసాగనున్నారు. వేములవాడ రాజన్న ఆలయంలో సూపరింటెండెంట్‌గా ఉన్న ఆయన నకిలీ డిగ్రీ సర్టిఫికెట్‌తో ఏఈఓగా పదోన్నతి పొందారని ఏసీబీ అధికారుల విచారణలో తేలింది. ఆయనపై వేములవాడ ఈఓ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు యాదగిరిగుట్ట ఈఓకు లేఖ రాశారు. దీనిపై గుట్ట ఈఓ భాస్కర్‌రావు స్పందించి ఇక్కడ ఏఈఓగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే హరికిషన్ సెలవుపై వెళ్లారని, తిరిగి ఆయన విధుల్లోకి చేరిన తరువాత ఏఈఓ పోస్టును రద్దు చేసి సూపరింటెండెంట్‌గా కొనసాగిస్తామని వెల్లడించారు.

## దారి చూపని దీపాలు

- అంధకారంలో కొండమల్లేపల్లి మెయిన్‌రోడ్డు

కొండమల్లేపల్లి, జనవరి 29 : కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని ప్రధాన రహదారుల్లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు నెల రోజులుగా వెలగక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కోదాడ నుంచి జడ్చర్ల జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పట్టణంలోని చౌరస్తా నుంచి కోల్‌ముంతల్‌పహాడ్ వరకు రోడ్డును వెడల్పు చేశారు. డివైడర్ల మధ్యలో బటర్‌ఫ్లై లైట్లు ఏర్పాటు చేశారు. లైట్లు ప్రారంభించి నాలుగు నెలలు అవుతున్నా ఏనాడూ సక్రమంగా వెలుగలేదు. నెల రోజులుగా దేవరకొండ రోడ్డు చౌరస్తా నుంచి తాసీల్దార్ కార్యాలయం వరకు లైట్లు వెలుగడం లేదు. దాంతో ఆ ప్రాంతమంతా చీకటిగా ఉంటున్నది. చీకట్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయితే లైట్ల నిర్వహణ విషయంలో ఎన్‌హెచ్ఏఐ, గ్రామపంచాయతీ అధికారులు మధ్య సమన్వయలోపంతో వాటి గురించి పట్టించుకునే వారు కరువయ్యారు.

**మరమ్మత్తులు చేయిస్తాం : డాకు నాయక్, పంచాయతీ కార్యదర్శి**

రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు వెలుగడం లేదనే విషయం ఇటీవల నా దృష్టికి వచ్చింది. అధికలోడ్ వల్ల ట్రాన్స్‌ఫార్మర్ తరుచూ కాలిపోవడం, తరుచు ఆన్‌ఆఫ్ చేసే క్రమంలో ఫీజు కాలిపోయి లైట్లు వెలుగడం లేదు. వాటి బాధ్యత చూసే కాంట్రాక్టర్ అందుబాటులో లేక జాప్యం జరిగింది. వెంటనే మరమ్మతులు చెయించి లైట్లు వెలిగేలా చూస్తాం.



కొండమల్లేపల్లి మెయిన్ రోడ్డుపై వెలగని హైమాస్ట్ లైట్లు

## ఫిబ్రవరి 1న త్రో బాల్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

చిట్యాల, జనవరి 29 : త్రో బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టు ఎంపికను ఫిబ్రవరి1న చిట్యాలలోని గ్రీన్ గ్రో పాఠశాలలో నిర్వహించనున్నట్లు త్రో బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పూర్ణచంద్రరావు, మోత్కూరు యాదయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీలలో పాల్గొనే వారు 1డిసెంబర్ 2009 తర్వాత పుట్టిన వారై ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల బాల బాలికలు పుట్టినతేదీ ధ్రువపత్రంతో ఉదయం 9గంటలలోపు రావాలని, వివరాలకు పీఈటీ రాము, సెల్ 9010208823ను సంప్రదించాలని సూచించారు.